క్లుప్తంగా

ప్రియాంకకు డాక్టరేట్



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ బయోటెక్నాలజీ విభాగ పరిశోధకురాలు జి ప్రియాంకకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని రీసెర్చ్‌సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.సుధాకర్ తెలిపారు. బయోటెక్నాలజీ పరిశోధనా పర్యవేక్షకులు డాక్టర్ ఎ.కృష్ణ సత్య పర్యవేక్షణలో 'సోయ్ మిల్క్ నుంచి వేరు చేయబడిన మైక్రోఎన్ క్యాప్స్ లేటెడ్ ల్యాబ్స్ సర్వైవల్, స్థిరత్వం' అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించినందుకుగాను డాక్టరేట్ ప్రదానం చేయడం జరిగిందన్నారు.

వెంకటాద్రి పేటలో కరెంటు కోతలు

నెహ్రూనగర్: స్థానిక నెహ్రూనగర్ చివర ఉన్న వెంకటాద్రి పేటలో కరెంటు కోతలు ఎక్కువైపోతున్నాయి. సోమవారం తెల్లవారుజామున 3.30 గంటలకు కరెంటుపోయి 6 గంటల వరకు ఇవ్వలేదంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పక్కనే ఉన్న న్యూ గుంటూరు రైల్వే స్టేషన్ రోడ్డులో కరెంటు ఉన్నప్పటికీ వెంకటాద్రి పేటలో కరెంటు పోవడం ఏమిటంటూ అంటూ స్థానికులు మండిపడుతున్నారు. ఎస్సీ కాలనీ కావడం వల్లే అధికారులు చిన్నచూపు చూస్తున్నారంటూ వారంతా ఆగ్రహిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కరెంటు కోతల నుంచి తమ పేటకు విముక్తి కలిగించాలని వారంతా కోరుతున్నారు.

బాధ్యతలు చేపట్టిన లయన్స్ నూతన కార్యవర్గం

నగరంపాలెం: లయన్స్ క్లబ్ ఆఫ్ గుంటూరు జయహో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం బృందావన్‌గార్డెన్స్‌లోని ఓ గెస్ట్‌హౌస్‌లో జరిగింది. అధ్యక్షుడిగా ముట్లూరి వెంకయ్య, కార్యదర్శిగా ప్రమోదాస్, ఆర్థిక కార్యదర్శిగా దివ్య సుబ్బారావులతో ఏపీ ఆర్‌ఐఎస్ కార్యదర్శి రాసంశెట్టి నరసింహారావు, పి.విజయ కుమార్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ యువత మత్తుకు బానిసై భవిష్యత్‌ను నాశనం చేసుకుంటుందని అన్నారు. యువత అభివృద్ధికై సేవా కార్యక్రమాలను నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో విజయ్‌చంద్, పూర్వ క్లబ్ అధ్యక్షులు ఎరసాని కోటేశ్వరరావు, రీజినల్ చైర్మన్ ఎస్.చక్రపాణి, రిటైర్డ్ ఎస్పీ శంకర్‌రావు, అప్పారావు, సుబ్బారావు పాల్గొన్నారు.

విద్యావనరుల కార్యాలయంలో చోరీ



ప్రత్తిపాడు: మండల విద్యావనరుల కార్యాలయంలో చోరీ జరిగింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని మండల విద్యావనరుల కార్యాలయానికి శనివారం సాయంత్రం కార్యాలయ సిబ్బంది ఎప్పటిలానే తాళాలు వేసి వెళ్లిపోయారు. ఆదివారం సెలవు కావడంతో సోమ వారం ఉదయం కార్యాలయ అటెండర్ రేణుక ఆఫీసుకు వచ్చారు. అప్పటికే కార్యాలయ ప్రధాన ద్వారంతో పాటు ఎంఈవో-1 గదికి ఉన్న తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించారు. వెంటనే విషయాన్ని ఎంఈవో సీహెచ్ రమాదేవికి ఫోన్ ద్వారా తెలియజేశారు. వారు వచ్చి పరిశీలించగా హాల్‌లో ఉండాల్సిన 43 ఇంచెస్ ఎల్ఈడీ స్మార్ట్ టీవీని ఆగంతకులు అపహరించుకుపోయినట్లుగా గుర్తించారు. దీంతో ఎంఈవో రమాదేవి ప్రత్తిపాడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. కాగా ఇదే కార్యాలయంలో గతంలోనూ గుర్తు తెలియని వ్యక్తులు బ్యాటరీలు, ఇన్వర్టర్లను దొంగిలించారు.

బెస్ట్ అవెల్‌బుల్ స్కూళ్లను పునరుద్ధరించాలి

మంగళగిరి: బెస్ట్ అవెల్ బుల్ స్కూళ్లను పునరుద్ధరించాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుర్రం రామారావు డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు విద్యనందించే బెస్ట్ అవెల్ బుల్ స్కూళ్లను పునరుద్ధరించాలని కోరుతూ మాల మహానాడు ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం మూడో రోజుకు చేరాయి. రామారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్కూళ్లను పునరుద్ధరించి వెంటనే ఎస్సీ, ఎస్టీ పిల్లలకు విద్యను అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు బొంతు రవి కుమార్, కుపుమ, గౌరి తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖుల పేర్లు అభినందనీయం

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలకు ప్రముఖుల పేర్లను పెట్టడం అభినందనీయమని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెరహెనీ క్రిస్టినా సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యాశాఖలో అమలు చేస్తున్న కార్యక్రమాలకు మాజీ రాష్ట్రపతులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, ఏపీజే అబ్దుల్ కలాం, ఆంధ్రుల అన్నపూర్ణమ్మ డొక్కా సీతమ్మ పేర్లను పెట్టనున్నట్లు విద్యాశాఖ మంత్రి ప్రకటించడం సంతోషకరమన్నారు.

జనం బాధ పట్టదా?



బిల్డింగ్ వ్యర్థాలను తరలిస్తున్న ట్రాక్టర్



బుచ్చయ్యతోట 1వ లైనులో ట్రాక్టర్ నుంచి కింద పడిన వ్యర్థాలు

నగరంలో ఇష్టానుసారంగా ట్రాక్టర్లు తిప్పుతూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నారు. గుంటూరు నగరంలో బిల్డింగ్ వ్యర్థాలను తరలించేందుకు ట్రాక్టర్లను పదుల సంఖ్యలో అడ్డగోలుగా తిప్పుతున్నారు. వ్యర్థాలను ట్రాక్టర్ బాడీ నిండుగా లోడు చేసుకుని వెళుతూ మలుపువద్ద, డివైడర్ల వద్ద ట్రాక్టర్లలో నుంచి బిల్డింగ్ వ్యర్థాలు కిందపడుతున్నాయి. సోమవారం బుచ్చయ్యతోట 1వలైనులో ట్రాక్టర్లు వ్యర్థాలను తరలిస్తున్న క్రమంలో డొంకరోడ్డులో, బుచ్చయ్యతోట 1వ లైనులో వ్యర్థాలు కింద పడ్డాయి. వాటిని ట్రాక్టర్ డ్రైవర్లు పట్టించుకోకపోవడంతో వాహనదారులు వాటిని తొక్కుకుంటునే ప్రయాణం సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి గుంటూరు నగరంలో ఉదయం వేళల్లో ట్రాక్టర్లను తిప్పకుండా... ఒక వేళ తిప్పినప్పటికీ పట్టాలు కట్టుకుని వెళ్లేలా చూడాలని కోరుతున్నారు.

– నెహ్రూనగర్

వసతి గృహ సమస్యల పరిష్కారానికి వినతి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

లక్ష్మీపురం: జిల్లాలో హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించి వారి ఉన్నత విద్యకు సహాయం చేయాల్సిందిగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు షేక్. సమీర్ సహాయ కార్యదర్శులు పవన్ యశ్వంత్ జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమంలో హాజరై జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఎస్సీ బాలుర వసతి గృహంలో పంకాలు లేవని, ఎస్సీ స్కూల్ వసతి గృహంలో మరుగుదొడ్లు కావల్సినవి లేకపోవడంతో అవి శుభ్రం చేయకుండా ఉండటంతో విద్యార్థులు రోగాలబారిన పడతున్నారన్నారు. అదే విధంగా బీసీ కళాశాల బాలికల వసతి గృహంలో సరిపడా వర్కర్లు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. బీసీ విద్యార్థులు ఎక్కువ మంది ఉండటంతో గదులు చాలక అవస్థలు పడుతున్నారని తెలిపారు. వసతి గృహాల్లో కిటికీలకి మెష్‌లు లేని కారణంగా దోమల ధాటికి విషజ్వరాలతో ఆసుపత్రుల పాలవుతున్నారని తెలిపారు. వసతి గృహాల్లో విద్యార్థుల కోసం ట్యూటర్లను, ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. స్టాల్ గరల్స్ ఎస్సీ హాస్టల్‌లో మరుగుదొడ్లలో లైట్లు లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నగరంలోని కోడిగుడ్ల సత్రం హాస్టల్‌ను వెంటనే ప్రారంభించాలని తెలిపారు. హాస్టల్స్ విద్యార్థులకు హాస్టల్స్‌లో అడ్మిషన్లు అందరికీ ఇవ్వాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కాస్మోటిక్ చార్జీలను పెంచాలని తెలిపారు. ఎస్ఎఫ్ఐ విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి సుజుకి ఎవినిస్ 125 సీసీ స్కూటర్



స్కూటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే గల్లా మాధవి, సరిపూడి అనీల్‌కుమార్

నగరంపాలెం: స్థానిక నవభారత్‌నగర్‌లోని సరిపూడి సుజుకి బ్రాంచ్‌లో 'సుజుకి ఎవినిస్ 125 సీసీ స్కూటర్'ను సోమవారం గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ టూవీలర్ విక్రయ రంగంలో సరిపూడి సుజుకి ఎంతో ఖ్యాతి గడించిందన్నారు. జపాన్‌కు చెందిన సుజుకి స్కూటర్‌ను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజలతోపాటు యువతకు ఎంతో క్రేజ్‌ను కలిగిస్తుందని పేర్కొన్నారు. సరిపూడి సుజుకి సంస్థ అధినేత సరిపూడి అనీల్‌కుమార్ మాట్లాడుతూ సుజుకీ ఎవినిస్ 125 సీసీ స్కూటర్ అధునాతన సాంకేతిక పరిజ్ఞానం కలిగి ఉందన్నారు. డ్రైవింగ్‌కు ఎంతో సులువైనదని చెప్పారు. నాణ్యతలో సాటిలేని స్కూటర్ అని పేర్కొన్నారు. 10 ఏళ్ల వారంటీతో ఖాతాదారులకు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎంబిపీఎల్ ఆర్ఎం శివరామకృష్ణ, సర్వీస్ ఆర్ఎం సునీల్, ఏఆర్ఎం బాలకృష్ణ, సీఈఓ శ్రీనివాస రావు పాల్గొన్నారు.

సకాలంలో అద్దె చెల్లించకపోతే చర్యలు తప్పవు

ఉమ్మడి జిల్లాల వక్ఫ్ ఇన్‌స్పెక్టర్ ముక్తార్ బాషా

లక్ష్మీపురం: వక్ఫ్ సంస్థల షాపు అద్దెలు సకాలంలో చెల్లించకపోతే చర్యలు తప్పవని గుంటూరు ఉమ్మడి జిల్లాల వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ ముక్తార్ బాషా సోమవారం తెలిపారు. గుంటూరు నగర ఇక్బాల్ మసీదు షాపింగ్ కాంప్లెక్స్ షాప్ నెంబర్ 15 అద్దెదారుడు భారీ మొత్తంలో బకాయి ఉన్నందున ఆ షాప్‌ను వారి సమక్షంలో సీజ్ చేసినట్లు గుంటూరు, బాపట్ల జిల్లాల వక్ఫ్ ఇన్‌స్పెక్టర్ ముక్తార్ బాషా తెలిపారు. కలీం అనే అద్దెదారుడు 2022 ఫిబ్రవరి నెల నుంచి 2024 జులై నెల వరకు నెలకు రూ.3800 చొప్పున సుమారు ఒక లక్ష 14 వేల రూపాయలు బకాయి ఉందని తెలిపారు. పలుమార్లు అద్దెదారుడి దృష్టికి తీసుకు వచ్చిన అద్దె చెల్లించకపోగా పట్టించుకోలేదని తెలియజేశారు. గుంటూరు నగరానికి చెందిన ఇతర వక్ఫ్ సంస్థల అజమాయిషీలో ఉన్నటువంటి అంజుమన్ ఇస్లామియా, రైల్ పేట మసీదు కాంప్లెక్స్ షాపులకు చెందిన వారు కూడా ఎక్కువ మొత్తంలో బకాయి ఉంటే వెంటనే చెల్లించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో షాపులను సీజ్ చేయవలసిన వస్తుందని ముక్తార్ బాషా హెచ్చరించారు. అద్దెదారులు సకాలంలో అద్దె చెల్లించాలని, లేనిపక్షంలో వారిని కబ్జాదారులుగా పరిగణించి చట్టపరమైన చర్యలు తీసుకోవలసి వస్తుందని తెలిపారు. అదే విధంగా వక్ఫ్ సంస్థకు ధర్మకర్తలుగా (ముతవల్లి) ఉన్నారో వారు అలాగే కమిటీ అధ్యక్షులు వక్ఫ్ ఫండ్ బకాయిలు 7 శాతం చెల్లించాల్సి ఉందని వక్ఫ్ ఫండ్ చెల్లించని పక్షంలో వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అలాగే ఇమామ్, మౌజన్‌ల గౌరవ వేతనం ఏదైతే ప్రభుత్వం మంజూరు చేస్తుందో అది కేవలం ఇమామ్, మౌజన్‌లకు మాత్రమే చెల్లించ వల్సిందిగా తెలిపారు. వారి హక్కు వారికి ఇవ్వకుండా మసీదు అభివృద్ధికి ఇతర పనులకు వినియోగించినట్లు సమాచారం వస్తే వారి పై వక్ఫ్ చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలి

ఎండీఎం అసిస్టెంట్ డైరెక్టర్ నిర్మలారాణి



విద్యార్థినులకు పాయసాన్ని అందజేస్తున్న ఎండీఎం ఏడీ నిర్మలారాణి, ఖాసిం

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ఖచ్చితంగా పాటించి, బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని అందించాలని డీఈవో కార్యాలయ మధ్యాహ్న భోజన పథక విభాగ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్. నిర్మలా రాణి పేర్కొన్నారు. సమగ్రశిక్ష ఆధ్వర్యంలో శిక్ష సప్తాహ్‌లో భాగంగా చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలతో పాటు ప్రాథమిక పాఠశాలలో తిథి భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనాన్ని ఆమె తనిఖీ చేశారు. పాఠశాల హెచ్ఎం షేక్ ఎండీ ఖాసిం మాట్లాడుతూ విద్యార్థుల్లో సమిష్టి భావన పెంపొందించడంలో తిథి భోజన కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ నూతలపాటి వీర ప్రకాశరావు, జైన్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ ఎండీ మున్ను సహకారంతో విద్యార్థులకు లడ్డూలు, సేమియా, సగ్గుబియ్యం పాయసాన్ని అందజేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన విభాగ సూపరింటెండెంట్ సాంబశివ రావు, సిబ్బంది మాధవి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రాబియా బస్రీ, పాఠశాల కమిటీ చైర్మన్ సుభానీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడు తండ్రికి అప్పగింత

మంగళగిరి: ఓ బాలుడు తప్పిపోయి పోలీసులుకు దొరకగా బాలుడిని పోలీసులు తల్లిదండ్రులకు సోమవారం అప్పగించారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. దుగ్గిరాల మండలం చిలువూరుకు చెందిన నెమలికంటి సుధాకర్ దంపతుల తనయుడు ఆనందరావు తాడికొండలోని గురుకుల పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. ఆనందరావు సోమవారం ఉదయం కాజ టోల్‌గేట్ వద్ద ఒంటరిగా తిరుగుతుండగా మొబైల్ పోలీసు వాహనంలోని సిబ్బంది గమనించి రూరల్ పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్ఐ సిహెచ్.వెంకటేశ్వరరావు చేరుకుని బాలుడిని స్టేషన్‌కు తరలించి పూర్తి వివరాలు తెలియకపోవడంతో ఎస్ఐ సోషల్ మీడియ గ్రూపులలోను బాలుడి ఆచూకీ తెలపాలని కోరారు. ఆనందరావు తండ్రి సుధాకర్ స్టేషన్‌కు చేరుకుని వివరాలు తెలపడంతో బాలుడిని సుధాకర్‌కు అప్పగించగా సుధాకర్ కుటుంబ సభ్యులు పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.

ప్రభుత్వ విధులు బాధ్యతతో నిర్వర్తించాలి



గుంటూరు వెస్ట్: ప్రభుత్వ ఉద్యోగమంటే కేవలం ఉపాధి మాత్రమే కాదని, అంతకు మించిన బాధ్యత అని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్. శంకరన్ సమావేశ మందిరంలో స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ కింద ముగ్గురు దివ్యాంగులకు జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజతో కలిసి నియామక పత్రాలు అందజేశారు. అందులో నెమలికంటి పవిత్ర, దొప్పలపూడి వినోద్‌కుమార్, చిట్టిబొమ్మ కనకారావు ప్రభుత్వ ఉద్యోగులుగా పత్రాలు అందుకున్నారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రజలకు ఉత్తమ సేవలు అందించడంతోపాటు, సహచర సిబ్బందితో సఖ్యతతో ఉండాలని తెలిపారు.

బ్యాగులో నగదు, బంగారం చోరీపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: వివాహ శుభకార్యంలో బ్యాగులోని డబ్బులు, నగలుచోరీకి గురైన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏ కన్వెన్షన్ హాలులో ఆదివారం వివాహం జరుగుతోంది. వినోభానగర్‌కు చెందిన మహిబుర్ రెహమాన్‌కు చెందిన బ్యాగులో రూ. 15 వేలు నగదు, పదిసవర్ల బంగారు గొలుసు చోరీకి గురయ్యాయి. రెహమాన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

యతిరాజుల బాలబాలాజీకి సాహిత్య శాస్త్రమర్మజ్ఞ బిరుదు



నగరంపాలెం: వైఎస్ఆర్ జిల్లా గండి క్షేత్రంలో ఈనెల 27 నుంచి 29 వరకు అఖిల భారత బ్రాహ్మణ మహా సంఘ్ విద్వత్ పంచాంగ సభలు జరగ్గా, అఖిల భారత శ్రీవైష్ణవ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి, గుంటూరుకు చెందిన యతిరాజుల బాలబాలాజీకి సాహిత్య శాస్త్ర మర్మజ్ఞ బిరుదు, శ్రీ గురు పురస్కార అవార్డు అందజేశారు. ఈ మేరకు బాలబాలాజీ సోమవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు సాహిత్యంలో, పురాణ ఇతిహాసాలలోని శాస్త్రీయ, సాంకేతిక విలువలను గుర్తించి, విద్యార్థులకు భారతీయ సనాతన జ్ఞానం గొప్పదనాన్ని తెలిపినందుకు బిరుదును ఏబీబీఎం సంఘ రాష్ట్ర అధ్యక్షులు ఇంద్రకంటి ప్రసాదశర్మ అందజేశారని ఆయన పేర్కొన్నారు.

యువకుల ఆత్మహత్యాయత్నం

పొన్నూరు: మండల పరిధిలోని నండూరు గ్రామంలో కుటుంబ కలహాల నేపథ్యంలో ఇరువురు యువకులు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం గ్రామంలోని వేర్వేరు కుటుంబాలకు చెందిన అభిరామ్, మహేష్ తల్లిదండ్రులు మందలించడంతో పురుగు మందు తాగినట్లు తెలిసింది. కుటుంబ సభ్యులు వెంటనే పొన్నూరులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించడంతో చికిత్స పొందుతున్నారు.

బ్యాంకు రుణంలో మోసంపై ఆందోళన

గుంటూరు రూరల్ : తన ఆధార్ కార్డుతో ఎవరో తనకు తెలియని వ్యక్తులు రుణం పొంది తనను మోసం చేశారంటూ ఓ వ్యక్తి నల్లపాడు జీడీసీసీ బ్యాంకు వద్ద ఆందోళనకు దిగిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. బాధితుడు లేమల్లెపాడుకు చెందిన వెలగ సిద్ధార్థ తెలిపిన వివరాల ప్రకారం నల్లపాడు జీడీసీసీ బ్యాంకు నుంచి తనకు నోటీసులు వస్తున్నాయని, రూ.10 లక్షల రుణం తీసుకున్నానంటూ నోటీసు ఇవ్వడంపై బ్యాంకు అధికారులను ప్రశ్నించాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం అతని ఆధార్ కార్డు ఉపయోగించి ఓ కోల్డ్ స్టోరేజీలో మిర్చి బస్తాల స్టాక్ బాండ్లు చూపించి రూ.10 లక్షల రుణాన్ని 2023 జూన్ 6న తీసుకున్నాడని, దానికి వడ్డీ చెల్లించకపోవడంతో రూ.11.30 లక్షలు చెల్లించాలని నోటీసులు వచ్చాయని తెలిపాడు. తనకు బ్యాంకులో ఎలాంటి అకౌంట్ లేదని, ఈ రుణాన్ని మర్రిపూడి చౌదరి అనే వ్యక్తి ఉపయోగించినట్లు తానే గుర్తించానని తెలిపాడు. బ్యాంకు మేనేజర్‌ను సంప్రదించి తనపేరుతో పొందిన రుణం అక్రమమని, తనకు ఎలాంటి సంబంధం లేదని, విచారణ జరిపి న్యాయం చేయాలని కోరాడు.

ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలి

ఇన్‌చార్జి కమిషనర్ శ్యామ్ సుందర్



ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరిస్తున్న ఇన్‌చార్జ్ కమిషనర్ శ్యామ్ సుందర్

నెహ్రూ నగర్: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్, ఎస్ఈ శ్యామ్ సుందర్ ఆదేశించారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో విభాగాధిపతులతో కలసి ప్రజల నుంచి ఫిర్యాదులు సోమవారం స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ఫిర్యాదులు రీ ఓపెన్ కాకుండా క్షేత్ర స్థాయి పరిశీలన చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సదరు ఫిర్యాదికి సమాచారం తెలియజేయాలని కోరారు. సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫొటోలు జత చేయాలని చెప్పారు. సచివాలయ కార్యదర్శులు విభాగాల వారిగా తమ సచివాలయం పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండాలన్నారు. 24 ఫిర్యాదులు రాగా వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 4, ఇంజినీరింగ్ విభాగానికి 6, రెవెన్యూ విభాగానికి 3, ప్రజారోగ్య విభాగానికి 4, అకౌంట్స్ విభాగానికి 3, ఉపా సెల్ విభాగానికి 2, ఎన్నికల విభాగానికి 1, సచివాలయాల విభాగానికి 1 చొప్పున ఫిర్యాదులు వచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, వెంకటలక్ష్మి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంహెచ్ఓ మధుసూదన్, మేనేజర్ ఎస్.ఎన్.ప్రసాద్ పాల్గొన్నారు.

సంక్షేమంపై పాలకులు దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న నూరిఫాతిమా

పట్నంబజారు: రాష్ట్రంలో ఫెల్యూర్ ముఖ్యమంత్రి జాబితాలో చేరిన ఘనత చంద్రబాబు నాయుడుకు దక్కుతోందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా విమర్శించారు. సోమవారం మంగళదాస్ నగర్‌లోని ఆమె కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రెండు నెలల పాలనలో రాష్ట్రంలో హత్యలు, మారణకాండలు, ఆస్తుల ధ్వంసం, పేదలకు సంక్షేమ పథకాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రజలు మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎంతో అభివృద్ధి చెందారని స్పష్టం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలనపై కనీసం నోరుమెదపని కొందరు నేతలు మాజీ సీఎం వై.ఎస్.జగన్‌ను విమర్శించడం సరికాదన్నారు. అమలు చేయని హామీలు ఇస్తూ సూపర్ 6 అంటూ ప్రజలను నిలువునా వంచించిన ఘనత చంద్రబాబుకు దక్కుతోందని దుయ్యబట్టారు. చంద్రబాబు సర్కార్ ఇకనైనా అరాచక పాలనను విరమించి రాష్ట్ర ప్రజల సంక్షేమంపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.

సమాచార హక్కు చట్టాన్ని నీరుగారుస్తున్నారు

ఆర్టీఐ అమలు ఉద్యమ కమిటీ సభ్యుడు చలమారెడ్డి



మాట్లాడుతున్న చలమారెడ్డి

లక్ష్మీపురం: సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చి రెండు దశాబ్దాలు గడిచాయని, లోటు పాట్లు సరిదిద్దుకుంటూ మరింత పదునెక్కాల్సిన సదరు చట్టం ప్రస్తుత ప్రభుత్వాల పుణ్యమాని నీరు కారుతోందని ఆర్టీఐ అమలు ఉద్యమ కమిటీ సభ్యుడు సి.హెచ్.చలమారెడ్డి అన్నారు. స్థానిక అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన చర్చా గోష్ఠి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 2005లో ఆర్టీ చట్టాన్ని తీసుకు వచ్చినప్పుడే దేశ భద్రత పేరు చెప్పి 22 సంస్థలకు మినహాయింపు ఇచ్చి దానిస్ఫూర్తి దెబ్బతీశారన్నారు. ఆ తర్వాత కాలంలో ఆ జాబితా పెరుగుతూ పోయిందన్నారు. ఆర్టీఐ పరిధిలోకి రాబోమని వాదించే వ్యవస్థలు, విభాగాలు ఎక్కువ అవుతున్నాయన్నారు. రాజకీయ పార్టీలు మొదలుకొని న్యాయ వ్యవస్థ వరకూ ఇందులో ఎవరూ తక్కువ తినలేదన్నారు. ఆర్టీఐ ఉద్యమకారుడు, వి.వి.రావ్, సంస్థ కార్యదర్శి కొండాశివ రామిరెడ్డి సమాచార హక్కు చట్టం గురించి వివరించారు.

9న హలో మాల ఛలో ఢిల్లీ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న గోళ్ల అరుణ్ కుమార్

నెహ్రూనగర్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఏపీ మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో 9న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు జేఏసీ చైర్మన్ గోళ్ల అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం అంబేడ్కర్ భవన్‌లో హలో మాల ఛలో ఢిల్లీ ధర్నా కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలం చెల్లిన వర్గీకరణ నేటి రాజకీయ పార్టీలు మళ్లీ తెరపైకి తీసుకువచ్చి ఎస్సీ వర్గీకరణ పేరిట రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేసే ఆలోచనలను మానుకోవాలని హితవు పలికారు. మాలల మహా ధర్నాకు ఆంధ్రప్రదేశ్ నుంచి మాల సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు డాక్టర్ గోదా జాన్‌పాల్, విప్పర్ల విజయ భాస్కర్, దారా హేమప్రసాద్, పిల్లి మేరి, బాబురావు, తురక వెంకటేశ్వర రావు, ఏచూరి వేణు పాల్గొన్నారు.

కారణజన్ములు డాక్టర్ వెంపటి సత్యం



శ్రీనటరాజమూర్తి విగ్రహం అందిస్తున్న దృశ్యం

నగరంపాలెం: కూచిపూడి నృత్యాన్ని ప్రపంచానికి తెలిసేలా చాటి చెప్పిన కారణ జన్ములు డాక్టర్ వెంపటి సత్యం అని డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి వారి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శ్రీసాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రముఖ కూచిపూడి నృత్య గురువు పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చిన సత్యం 12వ వర్ధంతి సభ నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు సి.హెచ్.మస్తానయ్య జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ భూసురపల్లి కూచిపూడి నాట్యానికి సంబంధించిన పలు అంశాలను ఆసక్తికరంగా సభలో విశదీకరించారు. అనంతరం కూచిపూడి బాలత్రిపుర సుందరీ సమేత రామలింగేశ్వర స్వామి వారి దేవాలయానికి బ్రహ్మాజీ చెక్కిన నటరాజ శిల్పాన్ని అందించారు. అనంతరం అకాడమీ శిష్యులు వెంపటి చినసత్యం నృత్యీకరించిన పలు నృత్యాంశాలను హృద్యంగా నర్తించారు. కళాకారులను సంస్థ కార్యదర్శి డాక్టర్ కాజా వేంకట సుబ్రహ్మణ్యం సత్కరించగా, కార్యక్రమాలను సంస్థ కోశాధికారి వెంకటగిరి నాగలక్ష్మి, ఊటుకూరి నాగేశ్వరరావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో కూచిపూడి సిద్ధేంద్ర కళాక్షేత్రం విశ్రాంత ప్రధానోపాధ్యాయులు డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి, ప్రముఖ రచయిత అమర్తలూరి వీరబ్రహ్మేంద్రరావు, బొల్లేపల్లి సత్యనారాయణ, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వర రావు, విశ్వ సంకీర్తనాచార్య తుర్లపాటి శంభయాచార్య పాల్గొన్నారు.

ఎట్టకేలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ

ప్రత్తిపాడు: ప్లస్ టూ విద్యార్థులకు ఎట్టకేలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ప్రత్తిపాడు భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని జూనియర్ కళాశాల (ప్లస్ టూ) విద్యార్థులకు క్లాసులు ప్రారంభమై దాదాపు 40 రోజులు గడుస్తున్నా నేటి వరకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చెయ్యలేదంటూ ఈ నెల 29న 'సాక్షి'లో 'పుస్తకం లేని పాఠం' శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం ప్రభుత్వ పాఠ్యపుస్తకాల డైరెక్టర్ కె.రవీంద్రరెడ్డి పుస్తకాలు పంపిణీ చెయ్యకపోవడానికి గల కారణాలపై ఆరా తీశారు. ప్రత్తిపాడు మండల విద్యాశాఖ అధికారులకు ఫోన్ చేసి సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఈవో శైలజ వెంటనే విచారించి తనకు విషయాన్ని తెలియజేయాలని ఎంఈవోలను ఆదేశించారు. అనంతరం హెచ్ఎం హెచ్.శ్రీనివాసరావు, ఎంఈవోలు సీహెచ్ రమాదేవి, లీలారాణిలు స్థానిక టీడీపీ నాయకులు, ఉపాధ్యాయులతో కలిసి ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించారు.